# రిటైర్మెంట్

డా. యల్లంరాజు సరోజా నిర్మల

"కౌంట్‌డౌన్ మొదలయింది మీకు" నవ్వుతూ అన్నాడు గుర్నాథం.

ఏ విషయంలో కౌంట్‌డౌన్ మొదలయిందో అర్థం కాలేదు మొదట నాకు. అడుగుదామని తలెత్తి అతడి కళ్ళల్లోకి చూసాను.

ఆ కళ్ళల్లో స్నేహభావం లేదు. పలకరింపు అసలే లేదు. ఓ రకమైన తేలికభావం, హేళన అతడిలో కనబడ్డాయి నాకు. అతడూ, నేనూ ఒకే ఆఫీసులో, ఒకే క్యాడర్‌లో పని చేస్తున్నాం. గట్టిగా చెప్పాలంటే కేవలం పరిచయస్తులం. అవసరార్థం మాట్లాడుకోడం తప్ప స్నేహంలాంటి పెద్ద పదాలకు మా మధ్య ఆస్కారమే లేదు. ఇప్పుడు పనిగట్టుకొచ్చి నన్ను చూసి తేలిక భావంతో నవ్వాల్సిన శత్రుత్వమూ లేదు మాకు.

పైఆఫీసర్లకి అడుగులకి మడుగులొత్తుతూ స్వార్థంతో ఆచి తూచి తోటివారిని పలకరించే అనామకుడతను. ప్రస్తావన వచ్చింది కాబట్టి ఇప్పుడు చెబుతున్నాను కానీ; అతడి గురించి ఆలోచించిందే లేదు నేను ఎప్పుడూ.

"కౌంట్‌డౌనా...నాకా...ఏ విషయంలో..." ఇవ్వని చనువు తీసుకుని మాట్లాడుతున్న అతడిని చిరాకుగా చూస్తూ అడిగాను.

"అదేనండీ...ఇంక పదకొండు నెలలేగా వుంది మీ సర్వీసు. మన క్యాడర్‌లో మొదట రిటైర్ అవుతోంది మీరే..." అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

చిర్రెత్తుకొచ్చింది నాకు.

"అయితే ఏమిటిట...ఇదేమైనా అంతర్జాతీయ విషయమా, అంత గుర్తుకు పెట్టుకుని అడుగుతున్నారు"

"అంతర్జాతీయ విషయాలు ఎవరికి కావాలండీ! గుర్తుపెట్టుకోవాల్సినవి యిలాంటి విషయాలే. ఇంతకీ మీరు రిటైర్ అవుతోంది అక్టోబరులోనే కదూ?"

"కాదు"

"అదేమిటీ...మొన్న సీనియారిటీ లిస్ట్ వచ్చినప్పుడు మీరేకదా చూపించారు"

"చూపించాను కదా! అది మీకు గుర్తు కూడా వుంది కదా? మళ్ళీ ఎందుకు యిప్పుడు కొత్తగా అడుగుతున్నారు?"

తడబడ్డాడు గుర్నాథం...సర్దుకుంటూ ఏదో గొణుక్కుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

పీడ వదిలింది అని నేను అనుకోలేదు. ఎందుకంటే యిలాంటి పీడలు వదలవని నాకు బాగా తెలుసు.

ఎదుటి మనిషిని సంతోషపెట్టడం కంటే, చికాకు పెట్టి ఆనందించే రాక్షస స్వభావం పెరిగిపోతోంది మనుషుల్లో.

ఆరోజు ఏదో ఒక అర్జెంట్ ఫైలు పట్టుకుని మా హెడ్‌క్లర్క్ దగ్గరకు వెళ్ళాను. నిజానికి ఉద్యోగంలో ఆవిడకంటే నేను రెండు క్యాడర్లు పైన ఉన్నాను.

ఆవిడనే నా దగ్గరకు పిలిపించుకోవచ్చు కానీ, ఆవిడ నడవలేదు. లావు పెరిగి పెరిగి నడవలేని స్థితిలో వుంది. ఆటోలో ఆఫీసుకు అతి కష్టం మీద వస్తుంది.

ఇద్దరు ముగ్గురు ప్యూన్లు ఆవిడని బలవంతంగా బయటకు లాగి చెరోవైపు పట్టుకుని తీసుకొచ్చి సీటులో పడేస్తారు. దాదాపు పాతికేళ్ళ సర్వీసు దాటినా ఆవిడకి పని రాదు. నేర్చుకునే కుతూహలమూ లేదు.

సంతకాలు పెట్టించుకునేందుకు వచ్చే గుమస్తాలను కూచోబెట్టి సోదివాగుడు మొదలు పెడుతుంది.

ఆవిడ సంతకం అవసరం కావడంతో వాళ్ళు బలవంతపు నవ్వులు నవ్వుతూ పారిపోడానికి దారులు వెదుకుతుంటారు.

ఖాళీగా కూర్చున్న ఆవిడకి దొరికిపోయాను నేను. నా మానవతా దృక్పథమే నా తప్పయిపోయిందనిపించింది నాకు.

క్రిందికి వెళ్ళి ఆవిడ ఎదురు కుర్చీలో కూర్చున్నాను.

అప్పటికే అక్కడ ముగ్గురు బలిపశువులున్నారు. ఫైలు తెరిచి ఆవిడ ముందు పెట్టి, విషయం ఎంత అర్జంటో కూడా చెప్పబోయాను. చేతిలోకొచ్చిన ఫైలుని మూసేసింది ఆవిడ.

"అవునూ! ఎప్పుడు రిటైర్ అవుతున్నారు మీరు?"

ఆవిడ అడిగిన ప్రశ్నకి తెల్లబోయాను నేను. అప్పటికి ఆవిడ ఆ ప్రశ్న నన్ను ఏడెనిమిదిసార్లు అడిగింది.

నేను కూడా ఓర్పుగా మర్యాదపూర్వకంగానే జవాబిచ్చాను ఆవిడకి మతిమరుపు కూడా వుందేమో అన్న భ్రమతో. ఈసారి అసందర్భంగా అడిగిన ఆవిడ ప్రశ్నకి నేను సమాధానం


చెప్పదల్చుకోలేదు.

"మేనేజర్‌గారు పనిమీద బయటకు వెడుతున్నారట. మీరు తొందరగా సంతకం పెట్టేస్తే, నేను వెళ్లి ఆయనతో విషయం చర్చించాలి" అన్నాను అసహనంగా కదులుతూ.

ఆవిడ మొహంనిండా నవ్వు. జింక మెడ కొరికి ఆహారం సంపాదించాననే పులి తృప్తి ఆవిడలో కనబడ్డాయి.

పనికిరాని వాడికే కదా పక్కవాడి విషయాల్లో యింట్రెస్టు.

"మీరు **అక్టోబరులో** కదూ **రిటైర్ అవుతున్నారు**. నేను వచ్చే **ఏడాది డిశెంబరులో...అంటే**



మీకంటే నేను ఏడాది మీద రెండు నెలలు చిన్నదానన్నమాట'' అంది ప్రతి అక్షరం ఒత్తి పలుకుతూ.

నాకంటే తాను చిన్నదాన్నని అక్కడున్న వాళ్లకి తెలియదేమో చెప్పాలి అన్న ఆతృత ఆ చూపుల్లో.

"నా కంటే మీరు ఎంత చిన్నవారని అడగలేదు కదా నేను. నాకెందుకు చెబుతున్నారా విషయం. ముందా ఫైలు సంగతి తేల్చండి'' నాకు తెలియ కుండానే నా కంఠంలో వాడితనం తొంగి చూసింది.

"అయ్యో...మీరు మేడంని అపార్థం చేసుకుంటున్నారు. ఆవిడ మీకంటే చిన్నవారైనా, మీరే చిన్నవారిలా కనబడుతున్నారు అని మెచ్చుకోలుగా అంటున్నారు. అంతేకదూ మేడం'' అన్నాడొక పరాన్నజీవి.

ఆవిడ మొహం మాడిపోయింది. ఆ పరాన్న జీవివైపు కొరకొరా చూసింది.

"జబ్బులు లేకపోతే నేనూ చిన్నదానిగానే కనబడేదాన్ని. అయినా నేను



## నిమ్మకాయల కారు

దక్షిణ ఫ్రాన్స్‌లోని మెంటన్‌లో ఈమధ్య లెమన్ ఫెస్టివల్ జరిగినప్పుడు ఒక ఆర్టిస్టు నిమ్మకాయలతో కారుని తయారుచేసి ప్రదర్శించాడు. విభి న్నంగా కనిపించిన ఈ కారుని అందరూ ఎంతో ఆసక్తిగా తిలకించారు.

-తటవర్తి




ఆవిడ అందచందాలతో నన్నేమీ పోల్చుకోడం లేదు. ఏదో తోటి ఆడదికదా ఎప్పుడు రిటైర్ అవుతున్నారు అని అడిగాను. ఇష్టం లేకపోతే చెప్పక్కర లేదు లెండి'' అంది.

"చూడండి లతగారూ! ఇందులో యిష్టానికీ అయిష్టానికీ తావే లేదు. ఇప్పటికి పదిసార్లు అడిగారు మీరు నా రిటైర్‌మెంట్ గురించి. ఆ విషయం మీకు అంత ముఖ్యమైంది అనుకుంటే ఆ తేదీ, నెలా బట్టీ పట్టీ జ్ఞాపకం పెట్టు కోండి. లేదా ఫ్రేమ్ కట్టించి టేబుల్‌మీద పెట్టుకోండి. ఆ ఫైలిటివ్వండి నేను డైరెక్టుగా మేనేజర్‌గారితోనే మాట్లాడుతాను'' అంటూ ఫైలు తీసుకుని బయ టికొచ్చేశాను.

"నాకంటే ముందు రిటైర్ అవుతున్నందుకు తెగ కుళ్ళిపోతోంది. నెల జీతాలుండవుకదా రిటైర్‌మెంటు రాళ్లు తప్పు...పదోసారే అడిగాన నుకో...చెబితే ఈవిడగారి నోటి ముత్యాలు రాలిపోతాయా..'' ఆవిడ ఎకసె క్కంగా అంటున్న మాటలు, అక్కడి వాళ్ల మాటలు నా చెవిన పడ్డాయి. భగ వంతుడు కూడా మార్చలేడు అటువంటివాళ్ల బుద్ధులు.

రిటైర్‌మెంట్ వల్ల నాకొచ్చే కష్టనష్టాలేం లేవు. సాధారణంగా బ్రతకగలిగి నంతా సంపాదించుకున్నాం నేనూ, మా ఆయనా. పిల్లలిద్దరూ జీవితంలో స్థిరపడ్డారనే చెప్పచ్చు.

అయితే రిటైర్ అవుతున్నందుకు నాకు బాధ లేదా... ఉంది. ఆత్మీయు లెవరో నన్ను శాశ్వతంగా వదిలిపెట్టి వెళ్లిపోతున్నారన్న దిగులు. దాదాపు పాతికేళ్లుగా వున్న రొటీన్ జీవితంలో కొత్త మార్పులు చోటు చేసుకుం టాయి.

నేను చేస్తున్న పనిలో తృప్తి వుంది నాకు. ప్రతి సంతోషాన్ని డబ్బుతో కొలవకపోతే నేను బాధపడుతున్నాననే చెప్పాలి.

అన్ని ఆఫీసుల్లోలాగే మా ఆఫీసులోనూ కొందరు శాడిస్టులున్నారు. వీళ్లు పనిపాటలు చేయరు. వాళ్ల మీదా వీళ్లమీదా చాడీలు చెబుతూ, ఎవరి నెలా మెత్తటి సూదులతో గుచ్చవచ్చో పథకాలు వేస్తుంటారు. తేలు స్వభావం కుట్టడం. అంతే, ఇలాంటి వాళ్లు తమలోపలి అభద్రతా భావాలకి ముసుగులు వేసి దొంగ క్షేమాలు విచారిస్తూ వ్యర్థంగా జీవితాన్ని గడిపేస్తుం టారు.

ఆరోజు అప్పుడే ఆఫీసుకొచ్చి నా సీటు దగ్గరకి నడుస్తున్నాను. నా గది ముందే ఎదురుపడి పలకరింపుగా నవ్వాడు ప్రకాశం. తప్పనిసరిగా పలక రించాల్సి వచ్చింది నాకు.

"బాగున్నారా ప్రకాశంగారూ!''

అదే తప్పయిపోయింది. నా వెనుకే గదిలోకి వచ్చి ఎదురుసీట్లో కూర్చు న్నాడు ప్రకాశం.

ఆఫీసుల్లో అందరి స్వభావాలూ ఒకేరకంగా వుండవు. మా ఆఫీసులో వున్న కొన్ని సిగ్గులేని వాళ్లల్లో ప్రకాశం ఒకడు. చెప్పు తీసుకుని కొట్టినా నవ్వుతూ మాట్లాడే తత్వం అతడిది. పై అధికార్లు చీదరించుకున్నా, చార్జీ షీట్లు యిచ్చినా అతడు పని చేయడు. తిట్లు తిని హాయిగా కాఫీకి వెళ్ళిపో గల ఘనుడతడు.

"అన్నట్లు మీకింకా రెండేళ్ల సర్వీసుందనుకుంటాను. రిటైర్‌మెంట్ ప్లాన్లు మొదలయ్యాయా? ఏం చేద్దామనుకుంటున్నారు? మీ భార్యాభర్తలిద్దరూ హాయిగా మీ యిద్దరు పిల్లల దగ్గరా చెరో ఆరు నెలలు కాలక్షేపం చెయ్యండి కృష్ణారామా అనుకుంటూ'' అన్నాడు ప్రకాశం ఆత్రంగా నా మొహంలోకి చూస్తూ.

నా రిటైర్‌మెంట్ గురించి ఆయనలా ఆదుర్దాపడడం అది పద్నాలుగో సారి. నేను జవాబివ్వలేదు అసహ్యం వేసి.

"మాట్లాడరేమండీ! ఏం చేద్దామనుకుంటున్నారు?'' రెట్టిస్తూ అడిగాడు

ప్రకాశం.

"ఏ మాట్లాడమంటారు? నా జీవితానికి సరిపడ మొత్తం షెడ్యూలు మీరు నిర్ణయించి చెప్పేశారుకదా! అలాగే చేస్తాంలెండి" అన్నాను చీదరించుకుంటూ.

"ఇంతకీ చెప్పనే లేదు మీరు. మీకు రెండేళ్ల సర్వీసుందా? మూడేళ్ళా?"

సహనం చచ్చిపోయింది నాకు.

"పద్నాలుగేళ్లు వుంది యింకా నాకు సర్వీసు" అన్నాను తాపీగా.

"అదేమిటండీ...మీకింకా ఏడు నెలలే సర్వీసుందని మొన్నామధ్య సెమినార్‌కి వెళ్లినప్పుడు చెప్పారు కదా?"

"చెప్పాను కదా? తెలుసు కదా? ఇప్పుడు మళ్లీ కొత్తగా అడుగుతున్నారేమిటి... సర్వీసు రెండేళ్లుందా మూడేళ్లుందా అని. మీకేమైనా తిక్క వుందా?"

అతడు ఆశ్చర్యంగా, ఆవేశంగా నావైపు చూశాడు. మరో ప్రశ్న వేస్తే జవాబేమి వస్తుందోనని భయడ్డాడో ఏమో...

"ఆ...అన్నట్లు మర్చిపోయాను. ఒక స్నేహితుణ్ణి కలవాలి..." అంటూ గబగబా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఆఫీసు పనివేళల్లో బయట బలాదూర్ తిరుగుళ్లు తిరగడానికి అతనికి సిగ్గులేదు అని వేరే చెప్పాలా?

మళ్లీ పనిలో పడిపోయాను. పనిలో ఆనందాన్ని వెదుక్కోడం నా రక్త గుణం.. నిశ్శబ్దంగా బాధని మనస్సులోనే అణచి వేసుకోడం నా స్వభావం. నా స్వభావానికి విరుద్ధంగా వాళ్ల వెకిలి ప్రశ్నలకి దీటైన సమాధానమిచ్చినా గుండెలో ఏదో బాధ కలిగి మనస్సు వికలమైంది. పర్మిషన్ తీసుకుని సెలవు పెట్టి యింటికెళ్లిపోదామని నిర్ణయించుకున్నాను. డ్రాకి తాళం వేసి రెండడుగులు వేసాను.

"వనజమ్మా...వనజమ్మా...ఇటురండి..." అంటూ ఎదురు రూం పంకజాక్షి పిలిచింది. నేను విననట్లే ముందుకు నడిచాను.

"మిమ్మల్నేనండి వనజమ్మగారూ! పిలుస్తుంటే వెళ్లిపోతున్నారేమిటి..ఇటురండి...ప్రసాదం పెడతాను" అంది తన ముందున్న డబ్బా చూపిస్తూ.

తన కళ్లతో నా కళ్లు కలిసాయి కాబట్టి నాకు సమాధానం చెప్పక తప్పలేదు.

"మీరు నాకేసి చూస్తూ ఎవర్నో పిలుస్తున్నారేమిటి?" అన్నాను నవ్వుతూ.

"భలేవారే...నేను మిమ్మల్నే కదా పిలుస్తున్నాను వనజమ్మగారూ అని..." అంది ప్రసాదం పెట్టబోతూ..

"నా పేరు వనజ. వనజమ్మ కాదు..." అన్నాను భావరహితంగా.

"అదే రిటైర్ అవబోతున్నారు కదా..పెద్దవారు అని..."

"అంటే అర్వైయోయేట మీరు నాకు పేరు మార్చి వనజమ్మా అని నామకరణం చేస్తున్నారన్నమాట. వద్దులెండి...ఉన్న పేరుతో పిలవండి చాలు..." అంటూ ప్రసాదం తీసుకుని ఇవతలకి వచ్చాను.

మేనేజరుగారి గదిలోకి వెళ్లాను సెలవు చీటీ పట్టుకుని. ఆయన నలుగురైదుగురు మా కొలీగ్స్‌తో మాట్లాడుతున్నారు.

"ఎందుకు మేడమ్ యింకా ఫైల్స్ పట్టుకుని పరుగెత్తుతున్నారు? మీకింకా నాల్గైదు నెలలేకదా సర్వీసుంది. హాయిగా విశ్రాంతి తీసుకోకుండా...మాకెలాగూ తప్పదు మరో అయిదేళ్లు" అన్నాడు రామచంద్రం నన్ను చూస్తూనే విషయమేమిటో తెలుసుకోకుండానే.

వళ్లు మండింది నాకు.

"రిటైర్ అవుతోంది కదా అని గవర్నమెంటేం జీతం యివ్వక్కరలేదంటోందా నాకు. ఎన్ని రకాలుగా డబ్బులు వస్తాయో అన్నీ లెక్కలు వేసుకుని మరీ తీసుకుంటున్నాం కదా మనం. చూడండీ! జీతం తీసుకున్నంత కాలం..చివరి రోజు వరకు పని చెయ్యాల్సిందే! తేర తిండి నేను తినలేను" అంటూ లీవ్ లెటర్ మేనేజర్ చేతిలో పెట్టాను.

"అవునవును.. పుట్టడం ఎంత సహజమో, చనిపోవడమూ అంతే సహజం. అలాగే ఉద్యోగంలో చేరేటప్పుడే మనకి తెలుసు ఒకరోజు మనం రిటైర్ అవ్వాలని. అందులో బాధ పడేందుకేముంది?" అంటూ సానుభూతిగా నావంక చూసారు మేనేజర్.

"యూ టూ బ్రూటస్.." అని గొణుక్కుంటూ బయటకు నడిచాను నాకంటే ఆరు నెలలే చిన్నవారైన మా మేనేజర్‌ని చూస్తూ.

★



## ఐశ్వర్య తమిళం

స్వతహాగా కొంకణి (కర్నాటక) మాతృభాష అయిన ఐశ్వర్యారాయ్‌కి హిందీ కూడా బాగా వచ్చు. అయితే ఇటీవల 'రోబో' షూటింగ్‌లో ఐశ్వర్య తమిళంలో చెప్పిన డైలాగుల తీరుకి అటు రజనీకాంత్, ఇటు దర్శకుడు శంకర్ కూడా ఆశ్చర్యపోయారట. కారణం స్పష్టంగా తమిళ పదాల్ని పలుకుతూ డైలాగులు చెప్పేసిందిట ఐశ్వర్య. ఇంత బాగా మీకు తమిళం వచ్చునుకోలేదుసుమండీ అంటే- 'నా తొలి సినిమాయే 'ఇరువర్' (ఇద్దరు) తమిళ భాషది, ఇంత కాలమైనా ఆ భాషని పలకలేనా చెప్పండి' అంటూ నవ్వేసిందిట ఐష్.

